
# శివగాథలు

వేమూరి వేంకటేశ్వరశర్మ



## కుబేరుడి పూర్వజన్మం

కౌంపిల్య నగరంలో వేద వేదాంగ విదుడైన యజ్ఞదత్తు డనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన కొడుకు గుణనిధి. మంచి అందగాడు.

చిన్నతనం నుంచే గుణనిధి ధూర్తుల స్నేహంతో దుర్గుణ నిధిగా మారిపోయాడు. జూద మాడడం, దొంగతనాలు చెయ్యడం అతని నిత్యకృత్యా లయ్యాయి. ఈ విషయాలు భర్తకు చెప్పకుండా దాచి, తల్లి అతన్ని గారాబంగా చూస్తూ, సన్మార్గ ప్రవర్తకుడివి కమ్మని హితబోధలు చేస్తూ ఉండేది.

ఎనిమిదో ఏడు రాగానే అతనికి ఉపనయనం జరిగింది. కానీ విద్య అతన్ని వరించలేదు. స్నాన సంధ్యాదులు కూడా విడిచిపెట్టి తన కార్యకలాపాల్లో మునిగిపోయాడు గుణనిధి.

అతనికి యౌవనం రాగానే తల్లి, దండ్రులు వివాహం చేశారు. అయినా అతని నడవడిలో కొంచెం కూడా మార్పు రాలేదు.

"నాయనా! మన వంశం నిప్పు లాంటిది. నీ తండ్రి పూత చరితుడు. విఖ్యాత యశో విరాజితుడు. ఆయన కడుపున పుట్టి ను వ్విలా చెయ్యడం మంచిది కాదు. ఆయన నిన్ను గురించి అడగని రోజు లేదు. ఎప్పటికప్పుడు ఏదో సర్ది చెబుతున్నాను. ఏనాటికైనా నీ గుట్టు బయట పడక మానదు. నీ మూలంగా మన వంశం అప్రతిష్ఠ పాలౌతుంది. నీకోసం నిత్యమూ ఎదురు చూసే భార్యతోనూ, తల్లిదండ్రులతోనూ సుఖంగా కాలం గడవకుండా ఎందుకు నీ కీ దుష్ట జన సాంగత్యం?" అని తల్లి కన్నీళ్లు పెట్టుకొనేది.

కన్నీళ్లతో కరిగే మనస్తత్వం కాదు గుణనిధిది. తల్లి మాటల్ని పెడచెవిన పెట్టడం అతనికి పరిపాటి అయింది.

ఒక రోజు మధ్యాహ్నం యజ్ఞదత్తుడు తన అంగుళీయకం జూదరి వేలికి ఉండడం చూసి - "ఈ ఉంగరం నీ కెలా వచ్చింది?" అని అడిగాడు ఆశ్చర్యంతో.

"అయ్యా! నీ కొడుకు జూదంలో ఓడిపోయి ఈ ఉంగరం ఇచ్చాడు" అన్నాడు జూదరి.

ఆ బ్రాహ్మణుడికి తల కొట్టినట్లు అయింది. కోపంతో ఇంటి కొచ్చాడు.

"భార్యామణీ! నాకు రాజుగా రిచ్చిన రత్నాల ఉంగరాన్ని తెచ్చి చూపించు" అన్నాడు.

ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. "ఎండలో వచ్చారు. ముందు భోజనం కానివ్వండి. తరువాత పెట్టెలోంచి తీసి ఉంగరం ఇస్తాను" అంది ఆయన్ని శాంతింప చెయ్యడానికి.

"నాకు ఇప్పుడే కావాలి. నీ కొడుకుని భ్రష్టుణ్ణి చేసింది చాలక ఇంకా అబద్ధాలు కూడా చెబుతున్నావా?" అని భార్య మీద కన్ను బున్ను మన్నాడు బ్రాహ్మణుడు.

ఈ విషయం తెలిసి వెంటనే తండ్రికి భయపడి గుణనిధి ఇల్లు విడిచి పారిపోయాడు.

కానీ తిండి తిప్పలు ఎలా? ఇంట్లో దొంగతనం చెయ్యడానికి వీల్లేదు. విద్యా విహీనుడు కావడం వల్ల సంపాదించడం చేతకాదు.

కొన్ని రోజులు పస్తు లున్నాడు చేసేది లేక. చివరికి అతనిలో పశ్చాత్తాపం పొడసూపింది.

తల్లి మాటల్ని నీటి మూటలు చేసినందుకు ఎంతగానో విచారిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఇంతలో మహా శివరాత్రి వచ్చింది.

ఆలయంలో భక్తులు లింగ పూజలు చేస్తున్నారు.

భగవంతుడికి నివేదించిన ఫలాలతో తాను ఆకలి మంటల్ని చల్లార్చుకోవచ్చని అర్ధరాత్రి దాకా ఆలయంలో జరుగుతున్న శివ పూజలు తిలకిస్తూ, శివ స్తుతులు వింటూ కూర్చున్నాడు గుణనిధి.

అర్ధరాత్రి దాటింది.

గర్భగుడిలో దీపం మినుకు మినుకు మంటోంది.

భక్తులు కునికిపాట్లు పడుతున్నారు.

ఇదే మంచి సమయ మనుకున్నాడు గుణనిధి. ఆలయాంతర్భాగంలోకి ప్రవేశించి, కొడిగట్టే దీపాన్ని సరిచేసి, అక్కడున్న పక్వాన్నాన్నీ ఫలాల్నీ దొంగిలించి గుట్టుచప్పుడు కాకుండా బయటికి వస్తున్నాడు. అప్పుడు అతని కాలు తగిలి అక్కడి వాళ్లు నిద్ర లేచారు.

గుణనిధి భయంతో పారిపోయాడు. దొంగ అనుకుని అతన్ని వెంబడించారు అక్కడి జనం.

చివరికి రక్షకభటులు రంగంలోకి దూకి బాణాలతో అతని ప్రాణాలు తీశారు.

అతనికోసం యమదూతలొచ్చారు. వాళ్లను అడ్డగించారు శివ దూతలు.

"వీడు బ్రాహ్మణుడై ఉండి కూడా పాపాత్ముడై, దురభ్యాసాలకు వశుడై, స్నాన సంధ్యాది నిత్యకృత్యాల్ని సైతం విస్మరించి, చివరికి శివాలయంలో చేరి దొంగతనానికి పాల్పడ్డాడు" అన్నారు యమదూతలు.

"వీడు దుర్మార్గుడే కావచ్చు. కానీ, మహాపర్వదినమైన శివరాత్రినాడు వస్తుండి, శివ నామ శ్రవణం చేసి, శివ సన్నిధిలో దీపాన్ని వెలిగించిన పుణ్యాత్ముడు!" అని చెప్పి శివదూతలు అతన్ని పరమేశ్వర సన్నిధికి తీసుకెళ్లారు.

కొంత కాలానికి శివానుగ్రహం చేత గుణనిధి కళింగరాజైన అరిందముడికి పుత్రుడై [దముడు] పుట్టి, చిన్ననాటి నుంచే శివభక్తాగ్రగణ్యుడై అనేక దానధర్మాలు ఆచరించి, రాజ భోగాలు అనుభవించి, చివరికి తనువు చాలించాడు.

మరు జన్మలో పులస్త్యుడి కొడుకైన విశ్రవసువుకు తనయుడై [వైశ్రవణుడు, కుబేరుడు లంకా రాజ్యాన్ని పాలించి, అటు తర్వాత అలకాపురికి అధినాథుడయ్యాడు.

ఆయన కాశిలో ఒక శివ లింగాన్ని ప్రతిష్ఠించి, శివప్రీతి కోసం దీర్ఘకాలం కఠిన తపోవ్రతాన్ని



ఆచరించాడు.

పార్వతీ పరమేశ్వరులు ప్రసన్నులై సాక్షాత్కరించారు. సహస్ర సూర్య సంకాశులైన ఆ పురాణ దంపతుల్ని చూడలేక కన్నులు మూసుకుని - "మహాదేవా! నీ సందర్శన భాగ్యాన్నీ నీ పాదవద్మ సేవా సౌభాగ్యాన్నీ నాకు కలిగించు!" అని ప్రార్థించాడు కుబేరుడు.

శంకరుడు సంతుష్టుడై అతనికి దివ్యదృష్టిని ప్రసాదించాడు.


కుబేరుడు కన్నులు తెరిచి పరమేశ్వరుడి పక్కనే ఉన్న జగన్మాత అందాన్ని అదేపనిగా క్రూర దృష్టితో చూశాడు. దాని ఫలితంగా అతని ఎడమ కన్ను దృష్టిని కోల్పోయింది.

ఆగ్రహించిన సతిని శాంతింపజేసి, భక్తుడి అపరాధాన్ని మన్నించి వరాలు అనుగ్రహించాడు భక్తవశంకరుడు.

"కుబేరా! నువ్వు కిన్నర కింపురుష గుహ్యకులకు ఏలిక వౌతావు. నవనిధులూ నీ అధీనంలో ఉంటాయి. నువ్వు మహా భోగ భాగ్యాలతో తులతూగుతూ నాకు చెలికాడివై ఉంటావు. నేను నీ నగర బాహ్యోద్యానంలో విహరిస్తూ ఉంటాను. ఈమె నీ తల్లి. నా అర్ధాంగి. ఈమె పాదాలకు ప్రణమిల్లి క్షమాభిక్ష వేడుకో!"

కుబేరుడు జగనాత్మకు అభివాదం చేసి ఆమె ఆశీస్సులు స్వీకరించి తన పట్టణానికి వెళ్లిపోయాడు.

[సమాప్తం]





## ఒక్కరోజులో 19 వేల లేఖలు

**పు**ట్టిన రోజు పండుగను కొత్త దుస్తులు ధరించి, కేక్ కట్ చేసి, తోటి స్నేహితులతో సరదాగా గడుపుతారు. కాని మద్రాసుకు చెందిన వి. శ్రీనివాస్ అనే అబ్బాయి తనకు అందిన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసే లేఖలతో రికార్డు నెలకొల్పాడు. జూలై 22, 1989న అతని పుట్టిన రోజు. ఆరు నెలలకు ముందు నుంచి వివిధ ప్రాంతాలలో గల తన మిత్రులకు బర్త్‌డే గ్రీటింగ్స్ పంపమని వ్రాశాడు. సరిగా అతని పుట్టిన రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు పోస్టుమాన్ ఒక రిక్షాలో పెద్ద సంచీతో శ్రీనివాస్ ఇంటి ముందు ఆగాడు. తీరా ఆ సంచీ విప్పి చూస్తే అన్నీ తనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వచ్చిన లేఖలే. దాదాపు 19 వేల లేఖలు పుట్టిన రోజునే రావడం విశేషం!

## వాక్యంలో 1300 పదాలు

**పదం** పదం కలిసి వాక్యం అవుతుంది. ఆ వాక్యం అయిదు పదాల దైనా కావచ్చు అరవై పదాలైనా కావచ్చు. ఆ వాక్యం చివరన ఫుల్‌స్టాప్ ఉండటం తథ్యం. ఆ తర్వాత మళ్ళీ క్రొత్త వాక్యం మొదలవుతుంది. కొన్ని వాక్యాలు కలిస్తే ఓ పేరా అవుతుంది. దాంట్లో పందో, రెండొందలో పదాలున్నాయని మనం గమనిస్తే, చదవడానికి కూడా సులువుగా ఉండటమే కాక త్వరగా అర్థమవుతుంది. అలా కాక ఒక వాక్యంలోనే ఒక వెయ్యి మూడు వందల పదాలుంటే? అందునా కాలక్షేపం కోసం చదివే నవల్లో.




అమెరికాకు చెందిన ప్రఖ్యాత రచయిత విలియమ్ ఫాకర్ రాసిన 'అబ్ సలోమ్ అబ్ సలోమ్' నవలలో ఒక వాక్యం ఉంది. ఆ వాక్యంలో దాదాపు 1300 పదాలున్నాయి. ఇది అబద్ధం కాదు. అక్షర సత్యం!

'అన్వేషి' [హైదరాబాదు]

## చార్లీచాప్లిన్

**చా**ప్లిన్ పేరు వినని వారుండరు. ఈతని పూర్తి పేరు చార్లెస్ స్పెన్సర్ చాప్లిన్. నాటక రంగం నుండి సినిమాల్లో ప్రవేశించి ఎంతో కీర్తి నార్జించిన వారు చాలా ఉన్నారు. అలాంటి వారిలో ఒకడైన చాప్లిన్ ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. చిన్న నాటనే ఇతను నాటక రంగంలో ప్రవేశించాడు. అప్పటికి అతనికి ఐదేళ్లు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు చాప్లిన్ తొలుదొలుతనే తన ప్రతిభా సామర్థ్యాలను



రంగస్థలంపై ప్రదర్శించి అందరి మెప్పులనూ పొందాడు. చిన్నతనంలోనే నటించాలన్న ఇతని ఆసక్తికి కారణం ఇతని తల్లేనని చెప్పవచ్చు. ఎందుకంటే ఆమె కూడా నటిగా మంచి పేరు తెచ్చుకుంది. మంచి గాయకురాలని కూడా ఆమెకు పేరుంది. 'టిల్లీస్ పంక్చర్డ్ రొమాన్స్' అనేది చాప్లిన్ నటించిన మొదటి చిత్రం. పుట్టింది 1889 లోనే ఐనా 1916 నాటికి ప్రముఖ హాస్యగాడుగా గొప్ప పేరు తెచ్చుకోగలిగాడు.

భోశ్రీ [హైదరాబాదు]